నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | నవంబర్ 17, 2024 | www.navatelangana.com

వికలాంగులకు ఆటల పోటీలు


క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

మహిళా పిల్లల,వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం లో భాగంగా వికలాంగులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్(రెవిన్యూ) వి.విక్టర్ జెండా ఊపి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు మనోధైర్యం కలవారని, అనుకున్నది సాధించి తీరుతారని అన్నారు. వైక్యం శరీరానికే కాని మనసుకు కాదని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని చేరుకునేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి చందర్ నాయక్, కార్యాలయ సిబ్బంది, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

3 రోజుల పాటు గంజ్ రైల్వేగేట్ మూసివేత



నవతెలంగాణ-కంఠేశ్వర్

రైల్వే మరమ్మతుల నిమిత్తం నగరంలోని మార్కెట్‌యార్డు సమీపంలోని గంజ్, లలితామహాల్ టాకీస్ వద్ద ఉన్న రైల్వే గేట్‌ను మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. రైల్వే గేట్‌ను 19వ తేదీ అర్ధరాత్రి నుంచి 21 వరకు మూసివేస్తున్నామన్నారు. రైల్వే గేట్ మూసి వేయడం వలన వాహనదారులు బ్రిడ్జిపై నుంచి రాకపోకలు చేసుకోవాలని, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని సూచించారు.

ఒకే డీలర్‌కు మూడు షాప్‌లు

- సకాలంలో అందని రేషన్ బియ్యం
- ఒక్కో షాప్‌నకు ఒక్కొక్కరిని కేటాయించాలని లబ్దిదారుల డిమాండ్



నవతెలంగాణ-వర్ని(చందూర్)

ఒకే డీలర్‌కు మూడు షాప్‌లు ఉండటంతో లబ్దిదారులకు సకాలంలో రేషన్‌బియ్యం అందడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఇటీవల రేషన్ డీలర్‌ల నియామకం చేపట్టినా.. చందూర్, వర్ని మోస్రా, రుద్రూర్ మండలాల్లో కొన్ని షాపులు ఇన్‌చార్జిలతోనే కొనసాగుతున్నాయి.

పేదలకు తమ తమ రేషన్ షాప్ ల ద్వారా అనుకూల సమయానికి, ప్రతి నెల 1 నుంచి 15 వ తేదీ లోపు ప్రభుత్వ రేషన్ బియ్యం డీలర్లు పంపిణీ చేయాలి. కానీ ఉమ్మడి మండలాల్లో కొన్ని చోట్ల ఇంచార్జీలే కొనసాగుతుం డటంతో ఒకే డీలర్ రెండు నుంచి మూడు షాప్‌లల్లో బియ్యం పంపిణీ చేస్తున్నారు. దీంతో పలువురుకి బియ్యం అందకముందే గడువు ముగుస్తుంది. ఇలాంటి పరిస్థితి చందూర్ మండల కేంద్రంలో, ఘన్ పూర్ గ్రామంలో కొనసాగుతున్నాయి. ఇతర గ్రామాల్లో సైతం ఇదే విధంగా కొనసాగుతుండటం గమనార్హం.

చందూర్‌లో 11వ రేషన్ షాప్ డీలర్ ఎవరు?

చందూర్ మండల కేంద్రంలో రెండు రేషన్ షాప్‌లు ఉన్నాయి. 10వ షాప్ డీలరే 11వ షాప్‌లో సైతం బియ్యం అందజేస్తుండటం గమనార్హం. ఇంతకు 11వ షాప్‌నకు డీలర్ ఎవరు అనే ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. ఆ షాప్‌కు డీలర్ ఉన్నప్పటికీ వేరే డీలర్ బియ్యం పోస్తున్నట్టు సమాచారం. దీంతో పాటు ఘన్‌పూర్ గ్రామంలో గల రేషన్ షాప్‌నకు కూడా 10వ నెంబర్ డీలర్ వచ్చి బియ్యం ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఘన్‌పూర్ షాప్ డీలర్‌పై కోర్టులో కేసు నడుస్తుండటంతో ఆ బాధ్యతలను వేరే డీలర్‌కు అప్పగించారు. ఒక్కరికే మొత్తం మూడు షాప్‌లు ఉండటంతో అటు డీలర్‌కు, ఇటు లబ్దిదారులకు ఇక్కట్లు తప్పడం లలేదు. కావున అధికారులు స్పందించి ప్రతి దుకాణానికి ఒక డీలర్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని లబ్దిదారులు కోరుతున్నారు.

ప్రతినెలా ఎదురుచూపులే

గాండ్ల సాయిలు. చందూర్

మండల కేంద్రంలో 11వ రేషన్ షాప్‌లో బియ్యం వచ్చిన మరుసటి రోజు నుంచి పంపిణీ చేయాలి. కానీ 10వ నంబర్ డీలర్ వచ్చి వరకు ఎదురుచూస్తున్నాం. ఆ డీలర్‌కు మూడు షాపుల్లో బియ్యం పోయాల్సి రావడంతో మాకు లేట్ అవుతుంది. కావున ఇన్‌చార్జీ ఇవ్వకుండా రెగ్యూలర్ డీలర్‌ను నియమించాలని కోరుతున్నాం. అప్పుడే మాకు ప్రతి నెల సక్రమంగా బియ్యం అందుతాయి.

గ్రూప్-3 పరీక్షలకు సర్వం సిద్ధం

- నేడు, రేపు రెండు రోజుల పాటు నిర్వహణ
- ఇరు జిల్లాల్లో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- నిజామాబాద్‌లో 66, కామారెడ్డిలో 20 సెంటర్‌లు
- బందోబస్తు ఏర్పాట్లు చేపట్టిన పోలీస్ శాఖ.. సెంటర్‌ల వద్ద 144 సెక్షన్



ఫైల్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి

గ్రూప్ -3 పరీక్షలకు సర్వం సిద్ధమైంది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నేడు, రేపు జరగనున్న పరీక్షలకు ఇరు జిల్లాల్లో అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. నిజామాబాద్ జిల్లాలో 19,941 అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. సంఖ్యకు అనుగుణంగా మొత్తం 66 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 8268 మంది అభ్యర్థుల కోసం 20 పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ప్రతి మూడు కేంద్రాలకు ఒకరు చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్టు అధికారులు తెలిపారు. సిట్టింగ్ స్క్వాడ్ బందాలు అనుక్షణం నిశిత పర్యవేక్షణ జరుపుతామని, సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నారు. పోలీస్ శాఖ తరపున బందోబస్తు చర్యలు చేపట్టారు. సెంటర్‌ల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉండనుంది.

ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్‌లు

ఈ నెల 17, 18వ తేదీలలో జరుగనున్న గ్రూప్-3 పరీక్షలకు ఇరు జిల్లాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్ లు రాజీవ్‌గాంధీ హనుమంతు, ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు.

17న ఉదయం 10.00 గంటల నుండి మధ్యాన్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షలు జరుగు తాయని, అదేవిధంగా 18వ తేదీన ఉదయం సెషన్ లో పరీక్ష ఉండ నుంది.

బయో మెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఉదయం పరీక్షకు సంబంధించి 9.30 గంటల వరకే పరీక్షా కేంద్రం లోనికి వెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందని, అనంతరం గేట్లు మూసివేస్తారని, మధ్యాహ్నం పరీక్షకు సంబంధించి 2.30 తరువాత ఎవరినీ లోనికి అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. చీఫ్ సూపరింటెండెంట్‌కు తప్ప మరెవ్వరికి పరీక్షా కేంద్రం లోపలికి మొబైల్ ఫోన్ అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రం లోకి మొబైల్ ఫోన్, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తీసుకువెళ్లేందుకు అనుమతి లేదని, ఈ మేరకు ప్రతి కేంద్రం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని ఆదేశించామన్నారు. పరీక్షా సమయం ప్రారంభం నుండి ముగిసేంత వరకు పరీక్ష కేంద్రం నుండి అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు కూడా బయటకు వెళ్లకూడదని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, సజావుగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు.

గ్రూప్-3కి పటిష్టమైన బందోబస్తు

నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ, కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ



ఆది వారం, సోమవారం రెండు రోజులు పాటు జరిగే గ్రూప్-3 రాత పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచ నీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ పటిష్ట భద్రతా, బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ, కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఐద్వా పరామర్శ


బాధిత మహిళా కుటుంబాన్ని పరామర్శించిన ఐద్వా నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్థానికంగా పక్కింటి వారితో నెలకొన్న వివాదంతో మనస్థా పానికి గురై చెరువులో దూకి ఆత్మహత్యాయత్నం చేసిన రూప అనే మహిళను ఐద్వా నాయకులు శనివారం పరామర్శించారు. భవన నిర్మాణ పనుల కోసం వలస వచ్చి పనులు చేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. ఇద్దరు మహిళలు గొడవ పడుతున్న సందర్భంలో రామ్‌రెడ్డి అనే బిల్డర్ వచ్చి మధ్యలో కలగచేసుకుని ఎప్పుడు గొడవ పడుతూనే ఉంటావు, ఇక్కడి నుంచి నువ్వు ఖాళీ చేయు అని ఒత్తిడి చేయడంతో రూప అనే మహిళకు ఇంకా ఆవేశం పెరిగి ఆరు సంవత్సరాలుగా లన పని నేను చేసుకుంటున్నా ఇప్పటివరకు ఎలాంటి సమస్య రాని నాకు కొత్తగా నువ్వు వచ్చిన తర్వాత ఈ గొడవల కారణంగా నన్ను కాళీ చేయమని అంటున్నారు అని ఎదుటి మహిళను విమర్శించగా ఆమె సునీల్ అనే బిల్డర్‌కి చెప్పి ఆ గొడవని ఇంకా పెద్దదిగా చేసినట్టు ఆరోపించారు. కాగా ఖాళీ చేసి వెళ్లిపోవాలని చెప్పడంతో తన భర్త ఆరోగ్య పరిస్థితి బాలేదని, తాను పని చేస్తేనే పిల్లల పోషణ కొనసాగుతుంది కావున తనను వెళ్లిపోవద్దని ప్రాదేయపడి.. తీవ్ర మనస్థాపంతో చెరువులో దూకి ఆత్మహత్యాయత్నం చేసినట్టు తెలిపారు. కుటుంబానికి ఐద్వా అండగా ఉంటుందని, ఎవరైనా ఖాళీ చేయాలని బెదిరిస్తే తమకు ఫోన్ చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత బాధిత మహిళకు సూచించింది. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వనజ జిల్లా కమిటీ సభ్యురాలు మాదవనగర్ ఉపాధ్యక్షురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దాన్యం కొనుగోళ్లల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి

- కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్


రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-మాక్లూర్

ధాన్యం కొను గోళ్లల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హను మంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని మాణిక్ బండర్ గ్రామంలో నిజామాబాద్ మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని, ఎప్పటికప్పుడు ఓపీఎంఎస్ ఆన్‌లైన్ చేయాలని అధికారులకు సూచించారు. గన్నీ బ్యాగులను పరిశీలించి రైతులకు అందజేసిన వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని అన్నారు. వరి కొనుగోలు, లోడింగ్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీలు చేయాలని కోరారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మెప్మా పీడీ రాజేందర్, మాక్లూర్ సొసైటీ వైస్ చైర్మన్ శేఖర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

110 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-కామారెడ్డి

దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మధ్యాహ్నం మూడు గంటల సమయంలో టేక్రియాల్ గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తూండగా గుర్తు తెలియని ముగ్గురు మగ వ్యక్తులు టూ వీలర్ బైక్ మీద వచ్చి అనుమాన రీతిలో ఉండగా వారిని పట్టుకొని తనిఖీ చేయగా వారి వద్దనుండి 110 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మూడు సెల్ ఫోన్లు, ఒక బైక్, 700 రూపాయలు సీజ్ చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఈ విషయమై వారిపై ఎన్ డి పి ఎస్ ఆక్ట్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము అన్నారు. విచారణలో ఈ వ్యక్తులు యూపీ రాష్ట్రానికి చెందినవారుగా తేలిందన్నారు.

రాష్ట్రంలో ప్రజాపాలన.. ఎల్లారెడ్డిలో రౌడీ పాలన


మాట్లాడుతున్న వడ్డేపల్లి సుభాశ్‌రెడ్డి

- భౌతిక దాడులు కాదు, ప్రజాపాలనపై దృష్టి పెట్టండి
- ఎమ్మెల్యేకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సూచన
- కాంగ్రెస్ కార్యకర్త అనీఫ్‌కు మదన్‌మోహన్ వర్గీయుల బెదిరింపు, చెరుకు తోట దగ్ధం ఘటనను ఖండించిన వడ్డేపల్లి

నవతెలంగాణ-రామారెడ్డి

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజాపాలన కొనసాగితే, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆధ్వర్యంలో రౌడీ పాలన కొనసాగుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాష్ రెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని రంగంపేట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రంగంపేట కాంగ్రెస్ కార్యకర్త మహమ్మద్ అనీఫ్ పై మదన్మోహన్ రావు వర్గీయులు శుక్రవారం సాయంత్రం భౌతిక దాడులు చేసి, కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేశారని, అని తల్లి మనస్థాపం చెంది గుండెపోటుతో ఆసుపత్రి పాలైందని, ఆమెను కామారెడ్డి ఆస్పత్రిలో పరామర్శించి రంగంపేట అనీఫ్ ను పరామర్శించడానికి సుభాష్ రెడ్డి వర్గీయులు వస్తున్నారని తెలుసుకొని, అనీఫ్ కు చెందిన రెండేకరాల చెరుకు తోటకు నిప్పంటించారని ఆరోపించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, సుభాష్ రెడ్డి ఫోటోలు పెట్టుకోవద్దని భయభ్రాంతులకు గురి చేయడం ప్రజాస్వామ్యంలో మంచిది కాదని, మీ తాటాకు చప్పుళ్ళకు బెదిరేది లేదని, మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృ తమైతే ఒకటికి పదిసార్లు అనుభవించవలసి వస్తుందని హెచ్చరించారు. నియోజకవర్గంలో దాదాపు 186 గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ స్టిక్కర్ను అతికించి కాంగ్రెస్ పార్టీని బతికించిన కార్యకర్తలపై దాడులు ఏంటని ప్రశ్నించారు. ఒక సంవత్సరం ఆరు నెలల క్రితం మహమ్మద్ అనీఫ్‌కు కాంగ్రెస్ లోకి ఆహ్వానించి ఇప్పుడు భౌతిక దాడులు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఎల్లారెడ్డిలో పెండింగ్ పనులను, బొంపల్లి సమస్యను, ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి పెట్టాలని, బ్యానర్లు, ఫోటోలపై రాజకీయం చేయడం ఎమ్మెల్యేకు తగినది కాదని సూచించారు. గెలిపించినందుకు ఎల్లారెడ్డి ప్రజలు బాధపడుతున్నారని, పిఏలు సిద్దు, వికాసుల చరిత్ర సమయం వచ్చినప్పుడు విప్పుతానని హెచ్చరించారు. మదన్మోహన్‌రావు ఒంటెద్దు పోకడతోనే ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎలక్షన్ల కంటే ఎంపీ ఎలక్షన్లకు 40 వేల మెజారిటీ తగ్గిందని అన్నారు.

కాగా కార్యకర్తపై దాడిని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గీ రెడ్డి మహేందర్ దాడిని ఖండించారు. కార్యక్రమంలో నా రెడ్డి శ్రీనివాసరెడ్డి, షరీఫ్, స్వామి రెడ్డి, సంతోష్, రాజేశ్వర్ రెడ్డి, బాల్‌రెడ్డి, లింగారెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు, వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నివాసాల వద్ద సౌకర్యాలు కల్పించాలి

- తహసీల్దార్‌కు వ్యవసాయ కార్మిక సంఘం వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, పేదలు

నవతెలంగాణ-భిక్కనూర్

పేదల నివాసాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని, అక్కడ నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం కామారెడ్డి జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు కోరారు. శనివారం తహసీల్దార్ శివప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగంపల్లి గ్రామంలో పేద ప్రజలు పోరాడి సాధించుకుని నివాసం ఉంటున్న మల్లు స్వరాజ్యం కాలనీలో రెండు సంవత్సరాలుగా పేద ప్రజలు జీవిస్తున్నారని వారికి హౌస్ నెంబర్లు కేటాయించి కరెంటు మీటర్లు మంజూరు చేయాలని కోరారు. పేద ప్రజలు పోరాడి సాధించుకున్న స్థలం మీద గ్రామంలోని ఇద్దరు ముగ్గురు పెద్దలు వారి స్వార్థ ప్రయోజనాల కోసం చట్టాన్ని ధిక్కరించి కోర్ట్ ఆర్డర్ ను సైతం పక్కనపెట్టి గ్రామస్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తమ తీరు మార్చుకోకపోతే జరగబోయే పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ నాయకులు రేవంత్ రెడ్డి మల్లు స్వరాజ్యం కాలానికి వచ్చి హామీ ఇవ్వడం జరిగిందని అది మర్చిపోయి కాంగ్రెస్ నాయకులు వారికి తోచినట్టు మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో భూ సాధన సమితి సభ్యులు నారా బోయిన అర్జున్, నీరుడి బాలరాజ్, పేరం నర్సవ్వ, జంగం సావిత్రి, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై, సిబ్బందిపై దాడులు సరికాదు

- పవర్ హౌస్‌లో ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వికారాబాద్ కలెక్టర్ అధికారులపై దాడి, నిజామాబాద్ జిల్లాలో అసిస్టెంట్ లైన్ మెన్ నవీన్‌పై దాడిని ఎలక్ట్రిసిటీ జేఏసీ తీవ్రంగా ఖండించింది. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జెయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పవర్ హౌస్ లో నిరసన కార్యక్రమం చెపట్టింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నిజామాబాద్ జిల్లా ఎస్ఈ రాపల్లి రవీందర్ మాట్లాడుతూ బోధన్ సంఘం గ్రామంలో పనిచేస్తున్న అసిస్టెంట్ లైన్మెన్ నవీన్‌పై దాడి చేయడం ఆటవిక చర్యగా పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులపై లచ్చగొర్ల గ్రామం దాడిని తీవ్రంగా ఖండించారు.

విద్యుత్ సిబ్బంది గ్రామాలలో 24 గంటలు పని చేస్తూ ,రెవెన్యూ వసూళ్లకు వచ్చినప్పుడు ఒక మహిళ ఉట్పల్లి గ్రామంలో తీవ్రంగా దాడి చేయడానికి ఖండించారు. మహిళపై కఠిన చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ లైన్మెన్ కు అండగా మేనేజ్మెంట్ ఉంది అని చెప్పారు. జేఏసీ కన్వీనర్ ఎస్ఎ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం చేసినటువంటి శాసనాలను ఉద్యోగులు అమలు చేస్తామన్నారు. బహిరంగ విచారణకు వచ్చిన కలెక్టర్ పై దాడి చేయడం శోచనీయమన్నారు మా విద్యుత్ సిబ్బందిపై కూడా ఇకముందు దాడిలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

1104 యూనియన్ కంపెనీ ప్రెసిడెంట్ రఘునందన్, 327 యూనియన్ సెక్రటరీ గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం సరైనది కాదని ప్రభుత్వానికి ప్రజలకు మధ్యగా సేవ చేయడమే మా లక్ష్యం మరి మాపై దాడి చేయడం అనేది భావ్యం కాదు ఒక కలెక్టర్ పైన దాడి చేశారంటే ప్రజాస్వామ్యం లో పద్ధతి కాదు అన్నారు. అసిస్టెంట్ లైన్మెన్ కి జేఏసీ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్ తోట రాజశేఖర్ డిఈలు ఏ రమేష్, వెంకటరమణ, జేఏసీ నాయకులు సురేష్, కుమార్, జి శ్రీనివాస్, రాజేందర్ రెడ్డి,గంగారం నాయక్,నాంపల్లి, శ్రీనివాసరావు, వేణుగోపాల్, ఆర్ చంద్రశేఖర్, రాజేందర్, నగేష్ కుమార్, పిఓ పోశెట్టి, నిజాముద్దీన్, సునీత, సరిత సుమిత, గౌతమి, దివ్య, హరికృష్ణ, బల్ల శ్రీనివాస్, శివకుమార్, డిసి రాజు, సతీష్ కుమార్,విద్యుత్ ఉద్యోగులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే సహించేది లేదు

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజక వర్గంలో అసైన్మెంట్ భూములు, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే పైడిరాకేష్ రెడ్డి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో కబ్జాకు గురైన అసైన్మెంట్ భూమిని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొందరు అర్ధరాత్రులలో అధికార పార్టీ ముసుగులో అధికారులను బెదిరిస్తూ, అధికారులను ప్రలోభ పెడుతూ ప్రభుత్వానికి చెందిన భూములను కబ్జా చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్ గజానన్, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, కలిగొట గంగాధర్, మందుల బాలు, జెస్సు అనిల్, దుగ్గి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పసికందు మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనే అని తండ్రి ఆరోపణ


మృతిచెందిన శిశువు

నవతెలంగాణ-కామారెడ్డి

వైద్యుల నిర్లక్ష్యంతో తమ పసికందు మృతిచెందనట్టు తండ్రి శేఖర్ ఆరోపించారు. జిల్లా ఆస్పత్రిలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన భార్య మొదటి కాన్పు ఇదే జిల్లా ఏరియా ఆసుపత్రిలో జరిగిందని అప్పుడు సాధారణ ప్రసవం చేసి తల్లి బిడ్డను ఆరోగ్యంగా ఇంటికి పంపించారాని తెలిపారు. రెండవ కాన్పు కోసం కామారెడ్డి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తీసుకు వచ్చామని, కానీ వైద్యుల నిర్లక్ష్యం వల్ల తన రెండవ బిడ్డ లోకం చూడకుండానే కన్నుమూశాడని ఆవేదన వ్యక్తం చేశారు.

వైద్యుల నిర్లక్ష్యం లేదు

కామారెడ్డి జిజిహెచ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఫరీదా బేగం

పసికందు మృతి పట్ల కామారెడ్డి జి జి హెచ్ ఆసుపత్రి సూపరిండెంట్ ఫరీదా బేగం స్పందించారు. ఈ కేసులో వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదని తెలిపారు. శేఖర్ భార్య రాధాకు గర్భం దాల్చినప్పటి నుండి అన్ని పరీక్షలను చేస్తూనే ఉన్నామని ఈనెల 23న ఆమె ప్రసవం డేట్ ఇచ్చామని, అయినా ముందస్తుగానే శుక్రవారం రోజే ఆమెను ఆస్పత్రికి రమ్మని చెప్పామని, వారు ఒక రోజు ఆలస్యంగా వచ్చినట్టు తెలిపారు. అయితే శిశువుకు డాబర్ కార్డ్(మెడ తిరిగిపోవడం) సమస్యతో మృతిచెందినట్టు తెలిపారు. ఒక్కోసారి డాబర్‌కార్డ్ స్కానర్‌లో కనిపించదని, ఒక్కోసారి మాత్రమే కనిపిస్తోందన్నారు. శనివారం వారు ఆసుపత్రికి రాగానే ఆపరేషన్ నిమిత్తమై రక్తాన్ని శాంపిల్ కోసం సేకరించామని, పరీక్షలు పూర్తయి ఆపరేషన్ కోసం తీసుకువెళ్తుండగానే మధ్యలోనే ఆమెకు నొప్పులు రావడం ప్రసవం అయినట్టు తెలిపారు. అయినప్పటికీ అనస్తీసియా (మత్తు వైద్యులు), పిల్లల వైద్యులు (సిపిఆర్) 40 నిమిషాల పాటు పసికందును బతికించే ప్రయత్నం చేశారని అయినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. ఎప్పుడైనా వైద్యులు పిల్లలను బతికించాలని చూస్తారని, అలాంటి వైద్యులు ఎవరికి ఎప్పుడు నిర్లక్ష్యంగా వైద్యం చేయరని అన్నారు.

కస్తూర్బా పాఠశాలలకు మార్షల్ ఆర్ట్స్‌గా 'ప్రతిభ' ఎంపిక


విద్యార్థినులకు మార్షల్‌ఆర్ట్స్ నేర్పిస్తున్న ప్రతిభ

నవతెలంగాణ-పిట్లం

కస్తూర్బా పాఠశాలలో వారాంతపు సెల్ఫ్ మార్షల్ శిక్షణ తరగతులకు అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారిణి వరల్డ్ రికార్డ్ హెూల్డర్, వరల్డ్ ఛాంపియన్ తక్కడపల్లి ప్రతిభ జిల్లా స్థాయి పాఠశాలలకు ఎంపికైంది. ఎంపికపట్ల ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్, కలెక్టర్ ఆశిష్ సెంగ్వాన్, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని కస్తూరిబా పాఠశాలల్లో వారాంతపు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ప్రతి ఆదివారం ఉదయం రిఫల్స్, లెర్నింగ్ క్యాంపస్ బాన్సువాడలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఘనంగా భీమన్న ఉత్సవాలు


ఉత్సవాలకు హాజరైన పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల కేంద్రంలో శనివారం ఉదయం ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం ఆధ్వర్యంలో భీమన్న ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో భక్తుల మధ్య భీమన్న దేవుణ్ణి ఊరేగించారు. ఈ ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకపోడు సంఘం పెద్దలు కంచు నరేష్, వేంపల్లి ప్రతాప్, లింగం, చింతకింది నర్సయ్య, మోహన్, నాని, డిష్ రవి, వేంపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ వెళ్లిన వికలాంగ ఉద్యోగి


వాహనంపైన వెళ్లిన కోఆర్డినేటర్ నగేష్

నవతెలంగాణ-బోధన్

సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద శనివారం చేపడుతున్న మహాధర్నా కార్యక్రమానికి బోధన్ మండల ఎంఈఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్ వికలాంగుడైన నగేష్ తన ద్విచక్ర వాహనంపై బోధన్ నుంచి హైదరాబాద్ ధర్నాకు వెళ్లారు. తమ డిమాండ్ల సాధన కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తాను ధర్నాకు వెళ్లినట్టు తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని నగేష్ కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

నవతెలంగాణ-ఎడపల్లి

లయన్స్ క్లబ్ ఎడపల్లి ఆధ్వర్యంలో గ్రామాలలో శనివారం మొబైల్ వ్యాన్ ద్వారా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆవరణలో మోతిబిందు నిర్ధారణ శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య యాదవ్ మాట్లాడారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, తినే ఆహారంతో అనేక కంటి సమస్యలు వచ్చి పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇలాంటి వారి కోసం గ్రామాలకు వచ్చి లయన్స్ క్లబ్ అందిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదల కోసం లయన్స్ క్లబ్ నిర్విరామంగా చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 22 మందికి మోతిబిందు ఉన్నట్లు నిర్ధారించారు. వీరికి బోధన్ లయన్స్ క్లబ్ ఆస్పత్రిలో ఉచిత శస్త్ర చికిత్సలు చేస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, రాష్ట్ర ప్రతినిధులు సూర్యనారాయణ, గంగారెడ్డి, కదం ప్రకాష్ రావు, కాశీనాథ్, పంచాయతీ కార్యదర్శి నాగరాజుగౌడ్, లయన్స్ క్లబ్ సిబ్బంది, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాహిత్య పోటీల్లో ఏర్గట్ల విద్యార్థుల ప్రతిభ


పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను బహుమతులు అందజేత

నవతెలంగాణ-ఏర్గట్ల

బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాహిత్య పోటీల్లో ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రతిభ చాటారు. కథల పోటీల్లో అభిలాష్‌కు మొదటి బహుమతి రాగా, కవిత్వం పోటీల్లో రూపక్‌కు మొదటి బహుమతి పొందారు. ఉపన్యాసం, ఏకపాత్రాభినయంలో రాజేష్‌కు మొదటి బహుమతి, కథల పోటీలో రిశ్వంత్‌కు ప్రోత్సాహక బహుమతులు లభించినట్లు తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు. సారస్వత పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లూరి శివారెడ్డి, చెన్నయ్య, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ కేవీ రమణాచారి, చేతుల మీదుగా నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసపత్రాలను అందుకున్నారని అన్నారు. రాష్ట్రస్థాయి బహుమతులు అందుకున్న విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలయాల వద్ద రాజకీయాలు మానుకోండి

- ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి సూచన

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆలయాల వద్ద ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి రాజకీయాలు మానుకోవాలని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి శనివారం సూచించారు. వాస్తవానికి రథోత్సవానికి భక్తులు అధికంగా రావడం, కొంత మంది భక్తులు రథోత్సవాన్ని చూడాలనే తొందరలో వాహనాలను రోడ్డుకి ఇరువైపులా నిలపడం ద్వారా, మరో ముగ్గురు రాంగ్‌రూట్లో రావడం ద్వారా రద్దీకి కారణమైందని, రథోత్సవ సమయంలో పోలీసులు ఎక్కువ మంది పైకి వెళ్లడం వల్ల కింద ఈ సమస్య సంభవించినట్టు భావిస్తున్నామని, కానీ కాంగ్రెస్ నాయకులను పంపి ప్రశాంత్ రెడ్డిని మాత్రమే ఆపారు అని మాట్లాడటం తగదని తెలిపారు. వాస్తవానికి టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్, ముత్యాల సునీల్, తానూ దాదాపు 2 కిలోమీటర్లు నడిచి వెళ్లామని ప్రశాంత్‌రెడ్డి తెలుసుకుంటే బాగుంటుందని తెలియజేశారు. బహుశా అధికారం కోల్పోయిన తర్వాత వచ్చిన మొదటి జాతర కావున ప్రశాంత్ రెడ్డికి దర్శం లేకపోవడంతో ఇబ్బంది పడ్డారేమోనని వ్యాఖ్యానించారు. ఆలయాల వద్ద రాజకీయాలు మాట్లాడొద్దని హితవు పలికారు.

ఆలూర్ కండి రాయుడు జాతర ఆహ్వాన పోస్టర్ల ఆవిష్కరణ



జాతర ఆహ్వాన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మల్లయ్య (కండి రాయుడు) జాతర మహోత్సవ ఆహ్వాన పోస్టర్‌ను శనివారం ఆలూర్ తహసీల్దార్ ఎం.రమేష్ చేతుల మీదుగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ, వీడిసి అధ్యక్షులు బార్ల ముత్యంరెడ్డి, ఉపాధ్యక్షులు తిర్మన్‌పల్లి నవనీత్, క్యాషియర్ కామన్ సుమన్, సభ్యులు కల్లెం మల్లేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- నవంబర్ 18న అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట బంద్ చేసి చలో ఆర్మూర్‌ను జయప్రదం చేయండి
- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపు


వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు జిల్లా కార్యదర్శి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆర్మూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 18న జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట బందు చేసి చలో ఆర్మూర్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. శనివారం సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ..

అనేక రోజుల నుంచి సమస్య పరిష్కారం కాకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులను తక్షణమే వీధుల్లోకి తీసుకోవాలన్నారు. లేనియెడల సోమవారం జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట బంద్ చేసి చలో ఆర్మూర్ పిలుపునిచ్చినట్టు తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండగంగాధర్ మాట్లాడుతూ.. జిల్లా విద్యాశాఖ అధికారి చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. జిల్లావ్యాప్తంగా బంద్‌కు మేధావులు, కార్మికులు సహకరించాలని కోరారు.

ప్రతి కుటుంబం సర్వేలో నమోదయ్యేలా చూడాలి

- తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో శ్రీనివాస్


కమ్మర్‌పల్లి : సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో


ఎడపల్లి: సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ఎడపల్లి

ప్రతి కుటుంబం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో నమోదయ్యేలా చూడాలని తహసిల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో తహసిల్దార్ ఆంజనేయులు, మండలంలోని హాసకొత్తూర్, చౌట్‌పల్లి, కోనాపూర్, దొమ్మరి చౌడు తండా గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్ పరిశీలించారు. పలు ఇండ్లకు వెళ్లి ఎన్యుమరేటర్లు నమోదు చేస్తున్న వివరాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సామాజిక వర్గాలను గుర్తించాలన్న సదుద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ఈ సర్వే సందర్భంగా ప్రజలు ఎన్యుమరేటర్లు అడిగిన వివరాలను సవివరంగా వెల్లడించి సహకరించాలని అన్నారు. మండలంలో జరుగుతున్న సర్వే తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్యుమరేటర్లు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం సర్వే సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆంధ్రయ్య, ఐకెపి ఏపిఎం కుంట గంగాధర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు నర్సయ్య, శాంతి కుమార్, గంగా జమున తదితరులు పాల్గొన్నారు.

తప్పులేకుండా సమగ్ర సర్వే నిర్వహించాలి..

ఎడపల్లి :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటా సర్వే కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతోపాటు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమకు కేటాయించిన గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాలలో ప్రతి ఇంటింటికి తిరుగుతూ సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించాలని, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చూడాల్సిన బాధ్యత ఉందని ఎడపల్లి మండల ప్రత్యేక అధికారి సాయగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలో ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆయన సందర్శించారు. అనంతరం సర్వేను పరిశీలించారు. అప్పటికే గ్రామ పంచాయతీ కార్యదర్శి, రామిరెడ్డి, బిల్ కలెక్టర్ పద్మావతితో పాటు సిబ్బంది నిర్వహించిన ఇంటింటి సర్వే పత్రాలను వారు పరిశీలించారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా గ్రామపంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి చేపడుతున్న సర్వే సక్రమంగా ఉందని అధికారులు అన్నారు. ఆయన వెంట ఎడపల్లి ఎంపీడీవో శంకర్ నాయక్, మంగల్‌పాడ్ గ్రామపంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి, బిల్ కలెక్టర్ పద్మావతి, సిబ్బంది కుంట సంతోష్, ఆయా గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు

- ఇంచార్జీ పోలీస్ కమిషనర్ సింధు శర్మ వెల్లడి



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా ప్రజలు తూచా తప్పకుండా పోలీస్ శాఖ నియమ నిబంధనలను పాటించాలని నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్ సింధు శర్మ శనివారం తెలిపారు. 'ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతిష్ఠించవద్దు. ముఖ్యంగా జనరద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్ ప్రభుత్వ భవనాలు లాంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేపట్టవద్దు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతులు తప్పనిసరిగా పొందాలి. ఎక్కువ శబ్దంతో డి.జేలను ఏర్పాటు చేయవద్దు. ఇలా చేయడం వల్ల దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బంది పడే అవకాశాలున్నాయి. ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. రెసిడెన్షియల్ స్థలంలో, కమర్షియల్ స్థలాల్లో రాత్రి సమయంలో 55 డెసిబెల్స్ సౌండ్ వాడాలి. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు డిజేల సౌండ్ సిస్టం పూర్తిగా నిషేదం. పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఊరేగింపులు, బహిరంగ సభల్లో పరిమితులకు మించిన ధ్వని శబ్దం ఉత్పత్తి చేసే డీజేలు, సౌండ్ సిస్టంలు నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో నిషేధం. ఎవరైనా సభలు, సమావేశాలు జన సంచార ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు పెట్టాలని భావిస్తే సంబంధిత అధికారుల నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. ఈ ఉత్తర్వులు ఈనెల 15 నుంచి 30వరకు అమలులో ఉంటాయి. నిజామాబాద్ జిల్లా ప్రజలందరూ పోలీస్ అధికారులకు సహకరించాలి.' అని ఇంచార్జి సీపీ సూచించారు.

స్కూల్ గేమ్స్ అండర్-17 బేస్‌బాల్ రాష్ట్ర అబ్జర్వర్‌గా గంగా మోహన్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిర్మల్ జిల్లాలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే స్కూల్ గేమ్స్ అండర్ 17 బేస్‌బాల్ రాష్ట్ర టోర్నమెంట్ అబ్జర్వర్‌గా జక్రాన్‌పల్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ వ్యవహరిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్‌గౌడ్, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి నాగమణి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ప్రభాకర్ రెడ్డి, జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినోద్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు సంగీతరావు, నీరజారెడ్డి, పవన్ కుమార్, రాజ్ కుమార్, వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయ బృందం సాయిలు, రామకృష్ణ, గంగాధర్, డాక్టర్ నరసింహారావు, సునీత, కృష్ణ, మాలతి, గంగాధర్ అభినందించారు.

కుల సంఘాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని(చందూర్)

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుల సంఘాల అభివృద్ధి కోసం అధిక నిధులు మంజూరు చేసే ప్రక్రియలో ఉందని, గత ప్రభుత్వం హయాంలో తాను కుల సంఘ భవనాలకు నిధులు ఇచ్చి నిర్మాణం చేపట్టామని వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం చందూర్ మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో మత్స్య కుల సంఘం భవనం ప్రారంభోత్సవానికి ఆయన విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌డిఎఫ్, పిడిఎస్ రూ.15 లక్షల నిధులతో భవన నిర్మాణం చేపట్టినట్టు వివరించారు. త్వరలో ఇందిరమ్మ ఇల్లు కూడా నియోజకవర్గానికి 3500 ఇండ్లు వస్తున్నాయని, ఖాళీగా స్థలం ఉన్నవారు ఇల్లు కట్టుకొంటే వారికి ప్రభుత్వం నుంచి 5 లక్షలు ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయ స్వామి, ఫిషరీస్ అధికారి శంకర్ రాథోడ్, చందూర్ గ్రామ మాజీ సర్పంచ్‌లు కర్లం సాయరెడ్డి, లక్ష్మపూర్ సర్పంచ్ సత్యనారాయణ, దాసరి గంగారాం, బోయి సంఘం అధ్యక్షులు తోకల లాలబోయి, మాజీ ఏఎంసీ చైర్మన్ మూడ్ అంబర్ సింగ్, లాలబోయి కొల్లూరు తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల్లో కాసుల బాలరాజ్ ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న కాసుల బాలరాజ్

నవతెలంగాణ-వర్ని

దెగ్లూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బిలోని తాలూకా సావళి, ఆర్, చిన్న ఆర్లి, డౌర్, కొండల్‌వాడి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ అసెంబ్లీ అభ్యర్థి నివర్తి రావుకు మద్దతుగా గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతుందని ప్రజలు ఒకసారి ఆలోచించి ప్రభుత్వ ఏర్పాటు కోసం కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, లక్ష్మణ్, పవన్, అరుణ్, శంకర్, తోట రాజు, యమ రాములు, మధు, సుధన్, గంగాధర్, మహ్మద్ భారీ, సాయిలు, రాజు, ఆరిఫ్, ధన్‌రాజ్, షాహబ్, అజీమ్, రాయిస్, మన్నన్, ఖంరోద్దీన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన ఇంటింటి సర్వేను స్వాగతిస్తున్నాం

- డిఎస్‌పి బాల్కొండ మండలాధ్యక్షులు నిశాంత్

నవతెలంగాణ-బాల్కొండ



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర సామాజిక కుల గణన ఇంటింటి సర్వేను ధర్మ సమాజ్ పార్టీ స్వాగతిస్తున్నట్లు డి.ఎస్.పి బాల్కొండ మండలాధ్యక్షులు నిశాంత్ శనివారం తెలిపారు. తెలంగాణ సామాజిక ముఖచిత్రం, తెలంగాణ సంపూర్ణ స్వరూపం, ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సామాజిక కులగణన ద్వారా తెలుస్తుందని అన్నారు. ఈ సర్వే వివరణతోనే భారత రాజ్యాంగం ప్రకారం సబ్బండ వర్గాల సంపూర్ణ సామాజిక ప్రగతికి కావాల్సిన వాటను సాధించుకోవడానికి దోహదపడుతుందని వివరించారు. సర్వే సంపూర్ణ అమలు కోసం ధర్మ సమాజ్ పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహారాజ్ నాయకత్వంలో ప్రజల తరఫున పోరాడుతున్నట్టు తెలిపారు. ఈ సర్వేకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని నిశాంత్ కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని బడాభీంగల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపి నాయకులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. చేరిన వారిలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు రాగుల మోహన్, నేల రాజన్న, బీజేపీ సీనియర్ నాయకులు సూళ్ళ భోజన్న, వార్డు మెంబర్ ముచ్కూర్ నరేష్, రాగులకిషన్, మల్లెల అంజయ్య, కోలి రవి, వడ్ల అంజి, రాగుల హరీష్, రాగుల రాజేందర్, రాగుల గంగనర్సయ్య, పల్లె చిన్నారెడ్డి, రమేష్, ఆకుల అంజయ్య, రాజగంగయ్య, రఘు తదితరులున్నారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సునీల్ కుమార్ వారందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి ప్రజా పాలనకు ఆకర్షితులై బాల్కొండ నియోజకవర్గంలో ముత్యాల సునీల్ కుమార్ సేవలలో భాగస్వామ్యం కావడానికి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారందరికీ ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేష్, కన్నె సురేందర్, పిట్ల శ్రీనివాస్, శ్రీధర్ గౌడ్, మహేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ మహాధర్నాకు తరలిన సమగ్ర శిక్ష ఉద్యోగులు


తరలివెళ్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నవతెలంగాణ-బోధన్

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధర్యంలో చేపడుతున్న మహాధర్నాకు బోధన్ మండలం నుంచి ఎస్ఎస్ఏ ఉద్యోగులు వాహనాలలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులను ప్రభుత్వం తక్షణమే మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన హామీ మేరకు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్, బాబు, విజయ, రేఖ, గంగాధర్, అర్వింద్, భూపేందర్ తదితరులున్నారు.

బాధితునికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి శనివారం కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కామారెడ్డి పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ఉట్ల నవీన్ కుమార్ గత కొన్నిరోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియ చంద్రశేఖర్ రెడ్డి, వార్డ్ కౌన్సిలర్ చాట్ల రాజేశ్వర్ కలిసి 15 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రానికి చెందిన బాధితులకు మంజూరైన సీఎంఆర్ చెక్కులను ఎమ్మెల్యే మదనమోహన్‌రావు సూచనలతో అందజేసినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకటరెడ్డి తెలిపారు. ఏడుగురు బాధితులకు మొత్తం రూ.2,12,000 విలువగల చెక్కులను అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు శివాజీ, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు, మాజీ సర్పంచ్ బండారి సంజీవ్, అంబీర్ శ్యామ్ రావు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామచంద్రం కే రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- **గ్రూప్ రాజకీయాలకు చోటివ్వొద్దు**
- **జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతారావు**

నవతెలంగాణ-బిచ్కుంద/జుక్కల్

రాబోయే స్థానిక ఎన్నికలకు ముందు గ్రామాల్లో, మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. శనివారం బిచ్కుంద మండల కేంద్రంలోని వ్యవసాయ మర్కెట్ కమిటీ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో మాట్లాడి గ్రామాల్లో నెలకొన్న సమస్యలు డ్రైనేజ్, సిసిరోడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు పలు అభివృద్ధి పనులపై కార్యకర్తలను ప్రజలతో గ్రామాల వారీగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి అధికారులు నిర్లక్ష్యం వహించకుండా సమస్యల పరిష్కరించాలని ఆదేశించారు. పార్టీలో గ్రూప్ రాజకీయాలకు చోటు లేకుండా కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కష్టపడిన కార్యకర్తలకు స్థానిక ఎన్నికలలో గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. నియోజకవర్గంలో రోడ్లు, మౌలిక సదుపాయాలు, విద్యా, వైద్యం, వ్యవసాయం మెరుగుపరచడమే తన ప్రాథమిక లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లికార్జునప్పా, గోపాల్ రెడ్డిపటేల్, పిసిసి డెలికేట్ విట్టల్ రెడ్డి, మాజీ డిసిసి డైరెక్టర్ వెంకట్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు ధర్పల్లిగంగాధర్, సుధీర్ చోప్రా ఆయా గ్రామాల కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.


బిచ్కుందలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే


జుక్కల్‌లో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ చేరిన పలువురు కార్యకర్తలు

కాంగ్రెస్‌లో భారీ చేరికలు

జుక్కల్: జుక్కల్ మండలం హంగర్గ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. గ్రామ కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే.. వీరందరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం వల్లనే జుక్కల్ నియోజకవర్గం వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పదిహేనేళ్ళు ఎమ్మెల్యేగా వెలగబెట్టిన మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే నియోజకవర్గంలోని గ్రామాలకు కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని విమర్శించారు. నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, స్పోర్ట్స్ స్కూల్, అగ్రికల్చర్, పాలిటెక్నిక్ కాలేజీలు తీసుకురావడానికి కృషి చేస్తున్నాని తెలిపారు. కష్టపడే కార్యకర్తలకు, పార్టీ కోసం పనిచేసే వారికి, ప్రతిభ గల ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. అనంతరం అదే వేదిక మీద చిన్నారి జన్మదిన వేడుకలు జరిపించి చిన్నారిని ఆశీర్వదించారు.. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

జుక్కల్ మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అందజేశారు. శనివారం తన క్యాంప్ కార్యాలయంలో పడంపల్లి, నాగల్ గావ్, పెద్ద ఏడిగి, ఖండే బల్లూర్, కౌలాస్ పలు గ్రామాల చెందిన 38 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.

ఎన్యూమరేటర్‌ల సంఖ్య పెంచాలి

- **జిల్లా అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన టీపీటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు**


అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ ప్రతినిధులు

నవతెలంగాణ-కామారెడ్డి

కుటుంబ సమగ్ర సర్వే కోసం ఎన్యూమరేటర్‌ల సంఖ్య పెంచాలని, సర్వే గడువు పొడగించాలని టీపీటీఎఫ్ ప్రతినిధులు కోరారు. శనివారం లోకల్‌బాడీస్, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్‌లు శ్రీనివాస్ రెడ్డి, విక్టర్ లను కలిసి విన్నవించారు. కుల గణనకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించినట్టు టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏన్యూమారేటర్ల సంఖ్య పెంపునకు అడిషనల్ కలెక్టర్ కిందిస్థాయి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. సర్వే గడువు పెంపుపై ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ లింగం, జిల్లా ఉపాధ్యక్షురాలు కే నలనీ దేవి, జిల్లా కార్యదర్శి కె నరేందర్, సిహెచ్ లక్ష్మి, విజయ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీనివాస్ కుటుంబీకులకు పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పెద్దఎడ్గి గ్రామానికి చెందిన డాక్టర్ శ్రీనివాస్ ఇటీవలే గుండెపోటుతో మరణించగా.. వారి కుటుంబీకులను మాజీ ఎమ్మెల్యే గంగారాం శనివారం పరామర్శించారు. హైదరాబాద్‌లో ఉండే డాక్టర్ శ్రీనివాస్.. దీపావళి పండుగ పురస్కరించుకొని కుటుంబ సభ్యులతో కలిసి తమ స్వగ్రామం పెద్దఎడ్గి వచ్చారని, కొన్ని రోజులు స్వగ్రామంలోనే గడిపి అనంతరం తిరుగు ప్రయాణం లో జోగిపేట్ వద్ద అకస్మాత్తుగా చాతి నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతిచెందారు. కుటుంబీకులను గంగారాం పరామర్శించి తనవంతుగా అన్ని సాహయ సహకారాలు అందిస్తానని వారికి భరోసా కల్పించారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృత్యువాత

నవతెలంగాణ-గాంధారి


మృత్యువాతపడిన ఎద్దు

గాంధారి మండలంలోని నేరల్ గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బ తండాకు చెందిన మంజ చత్రుకు చెందిన ఎద్దు శనివారం ఉదయం ప్రమాదవశాస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్‌తో మృత్యువాత పడింది. గడ్డి మేస్తుండగా.. ట్రాన్స్‌ఫార్మర్‌కి తగిలి విద్యుత్ షాక్ తగిలి ఎద్దు మృతి చెందింది. సుమారు రూ.40,000 వరకు నష్టం వాటిల్లిందని అధికారులు స్పందించి ప్రభుత్వ నుండి నష్టపరిహారం ఇప్పించాలని రైతు మంజ చత్రు కోరారు

డిసెంబర్1న చలో ఢిల్లీ

- **గిరిజన నిరుద్యోగంపై వాల్ పోస్టర్ ఆవిష్కరణ**




వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం

నవతెలంగాణ-గాంధారి

గిరిజన నిరుద్యోగంపై డిసెంబర్ 1న జాతీయ సదస్సుకు చలో ఢిల్లీ వాల్ పోస్టర్ ను గాంధారి మండల కేంద్రంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ నాయక్ మాట్లాడుతూ రోజురోజుకు గిరిజన ఆదివాసుల్లో నిరుద్యోగం కుప్పలాగా పెరిగిపోయిందని అలాగే ఎటువంటి వసతులు లేక దేశం గాని దేశం లో పోయి అక్కడ మోసపోయి ఉరితాడు బిగించుకుంటున్నారు తప్ప అభివద్ధి మాత్రం శూన్యం అన్నారు. స్వతంత్ర అనంతరం ఏ ఉద్యోగం నోచుకోని గిరిజనులు కొద్దిగొప్ప చదువుకున్నోళ్ల సంగతి ఏటు పనికి రాకుండా పోతుందని అన్నారు. రాబోయే కాలంలో గిరిజనులు, ఆదివాసులు ఉద్యోగం కోసం ఉపాధి కోసం భూమి కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. చలో ఢిల్లీకి యువకులు నిరుద్యోగులు కదలాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంజీవ్ నాయక్, నెహ్రూ నాయక్ సాయన్న తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ దొంగల బీభత్సం

- **అర్ధరాత్రి 3 దుకాణాల తాళాలు పగులగొట్టి చోరీ**



షెట్టర్‌లను పైకి లేపిన దుండగులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని తెలంగాణ ఎన్జీవోస్ భవన సముదాయంలో గల 3 దుకాణాల సెటర్ తాళాలను పగలగొట్టి శుక్రవారం నాడు రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం టీఎన్జీవోస్ భవన సముదాయంలో మూడు దుకాణాల తాళాలు పగలగొట్టి గుర్తు తెలియని దుండగులు దొంగతనానికి పాల్పడ్డారని తెలిపారు. గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ లో చొరబడి 3000 రూపాయల నగదును ఎత్తుకెళ్లారని, మహమ్మద్ అబ్దుల్ ఘనీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. కామారెడ్డి నుండి క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించారని తెలిపారు. దుకాణాల సముదాయాల వద్ద సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని ఈ సందర్భంగా ఎస్ఐ సూచించారు.

తెలుగు మీడియం చదువులు.. మరాఠీ పంతుళ్లు

- **సరిహద్దు గ్రామాల్లో మరాఠీ మీడియం టీచర్‌లతో ఖాళీల భర్తీ**
- **తెలుగు మీడియం పుస్తకాలు సరఫరా**
- **తెలుగులోనే పాఠాలు బోధించాలని పిల్లల తల్లిదండ్రుల డిమాండ్**




మండల పరిషత్ పాఠశాలకు వచ్చిన తెలుగు పుస్తకాలు

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్ర సరిహద్దు మద్నూర్ మండలంలోని మహారాష్ట్రకు పూర్తిగా బార్డర్ లో గల గ్రామాల్లోని పాఠశాలల్లో తెలుగు మీడియం చదువులకు గాను మరాఠీ మీడియం ఉపాధ్యాయులను కేటాయిస్తుండటంతో చదువుల్లో విద్యార్థులు వెనకబడుతున్నారని పిల్లల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కొత్తగా టీచర్ల భర్తీలో కూడా మరాఠీ మీడియం టీచర్లనే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం గమనార్హం.

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని హెచ్ కేలూరు గ్రామంలో ఆ గ్రామ పిల్లల తల్లిదండ్రులు కొన్ని సంవత్సరాల కాలంగా తమ పిల్లలకు మరాఠీ చదువులు వద్దు తెలుగు మీడియం చదువులే కావాలంటూ ఆందోళనలు చేపడుతూ వస్తున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం నుండి తల్లిదండ్రుల కోరిక మేరకు ఈ సరిహద్దు గ్రామాల్లో మరాఠీ మీడియం కాకుండా తెలుగు మీడియం చదువులు ప్రారంభించారు. తెలుగు చదువులకు గాను మరాఠీ మీడియం పంతులు ఉండటం వలన పిల్లల చదువులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని కొన్ని ఏండ్లుగా ప్రభుత్వానికి విన్నవించుకుంటూ వస్తున్నారు. తెలుగు మీడియం టీచర్లను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు.

కాగా తెలుగు మీడియం పుస్తకాలను పంపిణీ చేస్తూ మరాఠీ మీడియం ఉపాధ్యాయులతో పాఠాలు బోధింపజేస్తుండటంతో పాఠ్యాంశాలు అర్థం కాని పరిస్థితి నెలకొంది. తాజాగా ఉపాధ్యాయుల భర్తీలో సైతం ఈ సరిహద్దు గ్రామాల్లో మళ్లీ మరాఠీ మీడియం ఉపాధ్యాయులనే భర్తీ చేయడం పాఠశాలల్లో తెలుగు పుస్తకాల సరఫరా మరాఠీ మీడియం టీచర్ల భర్తీ కావడంతో మా పిల్లల చదువుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగానే మారుతోందని హెచ్ కేలూర్ గ్రామ పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లోని పాఠశాలల్లో పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తెలుగు మీడియం టీచర్లను నియమించి పిల్లల చదువులు బాగుపడేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమగ్రంగా, వేగంగా సర్వే చేపట్టాలి

- **అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి**

నవతెలంగాణ-తాడ్వాయి/లింగంపేట్

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇంటింటి సర్వే వేగంగా, సమగ్రంగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలో చేపడుతున్న సర్వేను పరిశీలించారు. సర్వే మరింత వేగంగా చేపట్టాలని సూచించారు. తప్పులు దొర్లకుండా పూర్తి వివరాలు సేకరించి నమోదు చేయాలని అన్నారు. ఎన్యూమరేటర్‌ల అవసరముంటే సరిపడా సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ అలీ. ఎంపీ ఓ సవిత రెడ్డి. ఏపీఎం మనోహర్ గ్రామాభివద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు పంచాయతీ కార్యదర్శి బాలు తదితరులు పాల్గొన్నారు.


లింగంపేట్ : సర్వే వివరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో


పకడ్బందీగా నిర్వహించాలి : ఎంపీడీవో


లింగంపేట్ : మండలంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ కుల గణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో నరేష్ సర్వే చేస్తున్న సిబ్బందికి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండలంలోని లింగంపేట మండలం లోని మోతె గ్రామంలో చేపడుతున్న సామాజిక ఆర్థిక సమగ్ర కుటుంబ సర్వే ను ఆయన పరిశీలించారు. మండలంలో ఇప్పటివరకు 66.5 శాతం సర్వే పూర్తయిందని అన్నారు. సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలు ఆర్థిక పరిస్థితులు విద్య తోపాటు 56 అంశాలకు సంబంధించినటువంటి పూర్తి వివరాలను సర్వేలో నమోదు చేయాలన్నారు. కుటుంబ సభ్యులపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావద్దన్నారు. కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలనే సేకరించి పొందపరచాలని సిబ్బందికి సూచించారు. కుటుంబ యజమాని ఇంటికి తాళం వేసిన ఉంటే తదుపరి చుట్టుపక్కల వారికి సమాచారం అందించి తాళం వేసిన ఇంటి సర్వే సైతం చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీఓ మలహరి సర్వే సిబ్బంది తదితరులు ఉన్నారు.


జుక్కల్: కులగణన సర్వే నిర్వహిస్తున్న అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని చిన్న ఎడ్గి గ్రామానికి క్షేత్రస్థాయిలో సర్వే పనులను పరిశీలించారు. ప్రజల క్షుప్తమైన సమాచారం తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని, అదే విధంగా తాళాలు వేసి ఉన్న ఇండ్లను గుర్తించి వారి ఇరుగుపొరుగు వారి నుంచి సమాచారం సేకరించి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వే అధికారులతో పాటు గ్రామ పంచాయతీ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: సర్వే జరుగుతున్న తీరును పలు గ్రామాల్లో పర్యటించి ఎంపీడీవో రాణి, ఎంపీవో వెంకట నరసయ్య శనివారం పరిశీలించారు. దన్నూరు గ్రామంలో ఆ గ్రామ పంచాయితీ అధికారి మనోహర్ చేపడుతున్న ఇంటింటా సర్వేను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు.

ఎల్లారెడ్డి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఎల్లారెడ్డి మండల పరిధిలోని వెలుట్లపేట గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను శనివారం నాడు ఎల్లారెడ్డి ఆర్ డి ఓ మన్నె ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క కుటుంబాన్ని వదలకుండా సర్వే చేయాలని,తప్పులు లేకుండా వివరాలు సేకరించి నమోదు చేసుకోవాలని ఎన్యు మారేటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి తాహసిల్దార్ మహేందర్, ఎంపీడీవో ప్రకాష్, ఏఈఓ రాజ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


తాడ్వాయిలో..


జుక్కల్‌లో..


ఎల్లారెడ్డిలో..

పొదల్లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

- **విద్యార్థులకు తప్పిన ప్రమాదం**


పొదల్లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని చిట్యాల గ్రామ సమీపంలో స్కూల్ బస్ పొదల్లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్‌లో సుమారు 30 మంది విద్యార్థులుండగా.. వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెనుప్రమాదం తప్పినటయింది. వివరాల్లోకి వెళ్తే.. చిట్యాల నుండి కామారెడ్డి వెళ్తున్న బి టాపర్స్ వివేకానంద పాఠశాల బస్సు ఎదురుగా వస్తున్న కార్‌ను తప్పించబోయి అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. అక్కడ చెట్టు ఉండటంతో దానికి ఆనుకొని బస్సు నిలిచిపోవడంతో ప్రమాదం తప్పినట్టయింది. లేకుంటే పెను ప్రమాదం వాటిల్లేదని స్థానికులు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేవు. కాగా డ్రైవర్ అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

స్టాఫ్‌నర్స్ పోస్ట్ భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ పోస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆసుపత్రి సూపరిండెంట్ రవీంద్ర మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింకు ఆర్ట్ సెంటర్‌లో ఖాళీగా ఉన్నటువంటి స్టాఫ్ నర్స్ పోస్ట్ కోసం కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేయడానికి అర్హత కలిగిన స్త్రీ,పురుష అభ్యర్థులు ఈనెల 18వ తారీఖునుండి 21 తారీఖు వరకు ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు నేరుగా ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు బీఎస్సి నర్సింగ్ లేదా జీఎన్ఎమ్ అర్హత కలిగి తప్పనిసరిగా రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్లో రిజిస్ట్రేషన్ నమోదు చేసుకొని ఉండాలని సూచించారు.

పోల్కంపేట్ గ్రామంలో విచారణ

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోల్కంపేట గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన చాకలి కాంతం ఆవు దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే.. ఆవును హత్య చేసిన నిందితులను పట్టుకునేందుకు పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. డి.ఎస్.పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోల్కంపేట గ్రామానికి చెందిన పలువురు అనుమానితులను స్టేషన్‌కు తీసుకువచ్చినట్టు సమాచారం. పోలీసులు నిందితులను ఎలాగైనా పట్టుకోవాలని విచారణ ఉమ్మరం చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
ఆదివారం | నవంబర్ 17, 2024 | www.navatelangana.com

మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు



మంత్రిని కలిసిన నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్(వేల్పూర్)

సచివాలయంలో జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రివ, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డితో కలిసి బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో మెండోరా మండలాధ్యక్షులు ముత్యంరెడ్డి, వేల్పూర్ మండలాధ్యక్షులు గడ్డం నర్సారెడ్డి, బాల్కొండ మండలాధ్యక్షులు వెంకటేష్‌గౌడ్, కమ్మర్‌పల్లి మండలాధ్యక్షులు రవి, ముప్కాల్ మండలాధ్యక్షులు ముత్యంరెడ్డి, భీంగల్ మండలాధ్యక్షులు స్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థులు అండర్ 17 ఎస్.జి.ఎఫ్ పోటీలకు రోహన్, హర్ష రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పూర్ణచందర్ శనివారం తెలిపారు. ఈ నెల 16 నుంచి 18 వరకు నిర్మల్‌లో నిర్వహించే ఎస్‌జిఎఫ్ బేస్‌బాల్ పోటీలలో పాల్గొంటారని వైస్ ప్రిన్సిపాల్ సాయన్న, దయల్ గంగాధర్, చక్రపాణి తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పీ.డీ జ్ఞానేశ్వర్. పిఈటి రాజేందర్, టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్ విద్యార్థులను అభినందించారు.

చెట్లు కోసే మిషన్ అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అర్గుల్ గ్రామ పంచాయతీ వద్ద జక్రాన్‌పల్లి విద్యుత్ సబ్ స్టేషన్ సిబ్బంది వారికి ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గోర్త పద్మ రాజేందర్ చెట్లు కోసేందుకు గానూ మిషన్‌ను మండల విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ ప్రవీణ్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ సిబ్బందిని అభినందిస్తూ, ప్రజలకు ఇంకా మెరుగైన సేవలను అందించాలని కోరారు. రాజేందర్‌కు విద్యుత్ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ జావేద్, గ్రామ లైన్మెన్ వసంత్, గ్రామ వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐదు రోజుల పాటు మల్లన్న, సౌడమ్మ ఉత్సవాలు



నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలో ఐదు రోజుల పాటు మల్లన్న, సౌడమ్మ ఉత్సవాలను యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం నుంచి నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మొదటి రోజు మల్లన్న మైలాలు, గంఇబోనం ఒగ్గు పూజారులతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

క్యాతం రాజిరెడ్డికి పరామర్శ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన క్యాతం రాజిరెడ్డిని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వంశి గౌడ్ శనివారం పరామర్శించారు. క్యాతం రాజారెడ్డికి యాక్సిడెంట్‌తో కాలుకు ఆపరేషన్ జరిగిన విషయం తెలుసుకొని అతని ఆరోగ్యం విషయాలను తెలుసుకున్నారు. ఆయన వెంట బిజెపి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జక్రాన్‌పల్లి విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థి శ్రీహరి ప్రసాద్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగన్న తెలిపారు. ఈ నెల 8వ తేదీన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 14 బాలుర వాలీబాల్ విభాగంలో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ఈనెల 16, 17, 18 తేదీలలో మెదక్ జిల్లా చేగుంటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు నిజామాబాద్ జిల్లా తరపున ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మురళి, రమేష్, సుభాషిని ఫిజికల్ డైరెక్టర్ పవన్ కుమార్‌ను అభినందించారు. మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికవ్వాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జక్రాన్‌పల్లి సీనియర్ వాలీబాల్ క్రీడారుకారులు జనగౌడ్, చిట్ల శ్యామ్, వెంకటేష్, మహేందర్, రంజిత్ విద్యార్థిని అభినందించారు.

ఏబీవీపీ నాయకుల అరెస్టు



ఏబీవీపీ నాయకుడిని అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ-నవీపేట్

బాసర ట్రిబుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో ట్రిబుల్ ఐటీ కార్యక్రమం నేపథ్యంలో నవీపేట్ పోలీసులు ఏబీవీపీ నాయకులను శనివారం అరెస్టు చేశారు. ఏబీవీపీ నాయకుడు కృషి పండిత్‌ను అరెస్టు చేయగా బిజెపి నాయకులు పరామర్శించారు. వెంటనే విడుదల చేయాలని ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ కుమార్ గౌడ్, ప్రవీణ్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన చేంగల్ మాజీ సర్పంచ్ గంగారెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముత్యాల సునీల్‌కుమార్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని చేంగల్ మాజీ సర్పంచ్ కట్కం గంగారెడ్డి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా పాలనకు ఆకర్షితులై బాల్కొండ నియోజకవర్గంలో ముత్యాల సునీల్ కుమార్ నాయకత్వంలో బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని వారు తెలిపారు. కార్యక్రమంలో వసంత్, జీవన్, కన్నె సురేందర్, కుంట రమేష్, జేజే నర్సయ్య, అనంత్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని బడా భీంగల్ గ్రామంలో సమగ్ర ఇంటింటి సామాజిక కుల సర్వేను ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎమ్‌ఆర్‌ఓ షబ్బీర్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి ఇంటికి తిరుగుతూ సమాచారాన్ని సేకరించి తప్పులు లేకుండా నమోదు చెయ్యాలని ఎంపీడీవో ఎన్యుమరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేర పరిశోధనలో జాగ్రత్తలు తీసుకోవాలి

- ఉమ్మడి జిల్లా ఇంచార్జీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ రహిమోద్దిన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నేర పరిశోధనలో జాగ్రత్తలు తీసుకోవాలని నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల ఇంచార్జీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ యం.డి. రహిమోద్దిన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.వైజయంతి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్త న్యాయ చట్టాలు భారతీయ న్యాయ సంహిత 2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023, భారతీయ సాక్ష్య అధినియం 2023లపై కేసుల పరిశోధనలో తీసుకొనే జాగ్రత్తలపై రహిమోద్దిన్ క్లుప్తంగా అవగాహన కల్పించారు. నేర పరిశోధనలో పోలీసు వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన చట్టాలను అవలంభించి నేరస్తులకు శిక్షపడేటట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వారి పరిధిలోని పోలీసు వారికి సలహాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ డిప్యూటీ డైరెక్టర్ యం.డి. రహిమోద్దిన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ పీసు రాజేశ్వర్, బంటు వసంత్, రాజోపాల్‌గౌడ్, నిమ్మ దామోధర్‌రెడ్డి, శ్రీనివాస్ ఖాందేష్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అశోక్, శివరాం నాయక్, చిదిరాల రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ సాగుపై అవగాహన

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండలంలోని నాగంపేట్ గ్రామంలో శనివారం ఉదయం జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ, ప్రీయూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఆయిల్‌ఫామ్ సాగుపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులను ఉద్దేశించి మండల ఉద్యానవన శాఖ అధికారి రుద్ర వినాయక్ మాట్లాడుతూ.. ఆయిల్‌ఫామ్ తోట సాగు మొదలు పెట్టినప్పటి నుంచి 30 నెలలలోపు వచ్చిన పూతను, గెలలను తొలగించేలా తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ముడి ఆయిల్‌ఫామ్ ధర టన్నుకు రూ.19,144 రూపాయలు ఉందని, రానున్న 2,3 నెలల్లో వీటి ధర రూ.20 వేలు దాటుతుందన్నారు. అదేవిధంగా ఆయిల్‌ఫామ్ కంపెనీ ఏరియా మేనేజర్ రోహిత్ మాట్లాడుతూ.. 2022 సంవత్సరంలో ఆయిల్‌ఫామ్ నాటిన రైతులు 2025 నాటికి మంచి దిగుబడిని పొందుతారని అన్నారు. డిసెంబర్ నెలలో రైతులకు అందుబాటులో గెలల సేకరణ కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు.



ఆయిల్‌ఫామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పరగ సంపర్కం కోసం రైతు బద్దం ముత్యంరెడ్డి మూడు సంవత్సరాల వయస్సు తోటలో పురుగులని వదిలినట్లు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ క్లస్టర్ ఆఫీసర్ రాజేందర్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన నలంద విద్యార్థులు



విద్యార్థులను అభినంధిస్తున్న పాఠశాల యాజమాన్యం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి నలంద హైస్కూల్‌లో ఆర్యభట్ట మెంటల్ ఎబిలిటీ టెస్ట్ పరీక్షను ఈ-అభ్యస్ ఐఐటి అకాడమీ హైదరాబాద్ వారు అక్టోబర్‌లో ఈ పరీక్షలు రాష్ట్రస్థాయిలో నిర్వహించారు. ఈ పరీక్షలకు 200 నుంచి 300 స్కూల్ విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ రాష్ట్రస్థాయి పరీక్షల్లో నలంద విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారాని పాఠశాల యాజమాన్యం శనివారం తెలిపారు. 9వ తరగతి కీర్తిరెడ్డి, బాలాజీ, మధుశ్రీ, 8వ తరగతి కార్తికేయ, శ్రీ హర్షిణి, చిన్మాయి, 7వ తరగతి హరిణి, హర్షిత్, అర్జున్, 6వ తరగతిలో సంఘమిత్ర, వెంకటలక్ష్మి, ప్రీతిరెడ్డి, 5వ తరగతిలో సింధూష, విలక్షణ, అభినయ్, 4వ తరగతిలో ప్రాచీ, మోక్షిత్, లోహితరెడ్డి, యశ్విన్‌రెడ్డి మొదటి మూడు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సాగర్, కరస్పాండెంట్ ప్రసాద్ సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఐటి, ఒలంపియాడ్ ఇంచార్జ్ ఉపాధ్యాయులు సతీష్, సందీప్, శ్వేతా, నిఖిల, రాజశ్రీ, శారద, ఉపాధ్యాయులను నలంద యాజమాన్యం అభినందించింది. విద్యార్థులను వారి తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు పులి శ్రీనివాసరావు వెల్లడి

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల సంక్షేమ కోసం అనేక పథకాలను చేపడుతుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పులి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఎడ పల్లి మండల కేంద్రంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడా రు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నా రు. ఎడపల్లి, అంబం (వై), ఏఆర్‌పి క్యాంప్, బ్రాహ్మణపల్లి గ్రామాల బాధితులు సీఎం సహాయనిధికి దరఖాస్తులు చేసుకోగా.. ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బంజ కామప్ప, బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొబ్బిలి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సున్నపు ఒడ్డెన్న, రవీందర్, ఇర్ఫాన్, సంజీవ్ తదితరులున్నారు.



లబ్దిదారులకు చెక్కులు అందజేస్తున్న మండల అధ్యక్షులు శ్రీనివాసరావు

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు సత్యశోధక్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నవతెలంగాణ-సిరికొండ

తెలంగాణ స్కూల్ గేమ్స్ బేస్‌బాల్ ఆధ్వర్యంలో నేటి నుంచి (16 నుంచి 18) సోమవారం వరకు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్ 17) బేస్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. ఈనెల 14న ఆర్మూర్‌లో జరిగిన జిల్లాస్థాయి జూనియర్ బేస్‌బాల్ ఎంపిక పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన పాఠశాలకు చెందిన జి.సాయికిరణ్, ఎం.చందును పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఆర్.నర్సయ్య మాట్లాడుతూ.. నిరంతరం అభ్యాసం వలన నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు. క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గంగారెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు అనిల్, సంతోష్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-ఆర్మూర్

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, సొసైటీ చైర్మన్ పెంట భోజారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అజ్జు భాయ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే నేటితో పూర్తి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని మౌలాలి తాండ గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే నేటితో పూర్తి కానుందని గ్రామ కార్యదర్శి రజిత పేర్కొన్నారు. మొత్తంగా మూడు కుటుంబాల వారు అందుబాటులో లేకపోవడం వల్ల ఆదివారం వారిని రప్పించి సర్వేను పూర్తి చేయనున్నట్లు ఆమె స్పష్టం చేశారు.

చేపపిల్లలు విడుదల



చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలోని చెరువులలో మత్స్యకారులు, స్థానిక నాయకులతో కలిసి చేప పిల్లలను శనివారం విడుదల చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, శంతేశ్వర్ పటేల్, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు మేత్రి భూమయ్య, చందర్, పుప్పాల శంకర్, వర్ని శంకర్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఎస్వో జి.వినోద శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో హెడ్‌కుక్ పోస్టు కోసం 10వ తరగతి, అసిస్టెంట్ కుక్ 7వ తరగతి, నైట్ వాచ్ ఉమెన్ పోస్టుకు పదోతరగతి పూర్తి చేసిన మహిళా అభ్యర్థినీలు అర్హులని తెలిపారు. స్థానిక మండల కేంద్రానికి చెందిన వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. కావున మండలంలోని నిరుద్యోగ మహిళా అభ్యర్థినీలు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక పాఠశాలలో సంప్రదించాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు.

యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి జన్మదిన వేడుకలు



విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్‌ను అందజేసిన నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గైన కిరణ్ జన్మదిన వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సగ్గు వెంకటి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాయిబాబా గౌడ్, ఎమ్మెస్ రమేష్ కుమార్, కార్తీక్ యాదవ్, కాంగ్రెస్ మహిళా మండలాధ్యక్షురాలు ఇందిరారెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు లోక కృష్ణ, సల్మాన్, ఏఎంసి డైరెక్టర్ కురుమే శ్రీనివాస్, సమ్మి, హనుమాన్లు, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు శివకుమార్, గైనిసాయిలు, భూమేష్, షబ్బీర్, అరుణ్, శ్రీకాంత్, రాకేష్, శరత్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

లిల్లీపుట్ విద్యార్థుల విజ్ఞాన విహారయాత్ర



నవతెలంగాణ-ఆర్మూర్

లిల్లీపుట్ పాఠశాలలోని విద్యార్థులు విహారయాత్రకు శనివారం వెళ్లారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరూ బాసర సరస్వతి ఆలయంలో పూజలు చేసి ఆనందంగా గడిపారు. బాసరలోని రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ మాస్టర్ వివరంగా రైళ్ల రాకపోకల గురించి తెలిపారు. అలీసాగర్‌లో బోటింగ్ చేస్తూ, సారంగాపూర్ ఉత్తర తిరుపతి వంటి వివిధ రకాల ప్రాంతాలను సందర్శించి సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఈ విధంగా విహారయాత్ర తీసుకువెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్నాకు ఇందిరాపార్క్‌కు తరలిన సీఆర్పీలు

నవతెలంగాణ-లింగంపేట్

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం పిలుపుమేరకు చలో ఇందిరాపార్క్ కార్యక్రమానికి శనివారం సీఆర్‌పీలు తరలివెళ్లారు. 2023 సెప్టెంబర్ లో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ లో ఏకశిలా పార్కు నందు నిర్వహిస్తున్న ధర్నా శిబిరానికి హాజరై తమ ప్రభుత్వం ఏర్పడిన వందరోజులలో డిమాండ్‌లు నెరవేరుస్తామని హామీ ఇచ్చి విస్మరించారని అన్నారు. డిమాండ్లు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వం వచ్చి 11 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి హామీని నెరవేర్చలేదని అన్నారు. అందుకే సంఘం పిలుపు మేరకు ధర్నాకు తరలివెళ్లినట్టు తెలిపారు.ఈ ధర్నా కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం నుండి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ సామల రాజు విజయ్ కుమార్ రాజు సంఘ గౌడ్ బన్సీలాల్ స్వప్న సంతోష్ సంగమేశ్వర్ సంజీవ్ రాజేష్ మొదలగువారు తరలిన వారిలో ఉన్నారు.

క్రీడలను భాగం చేసుకోవాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆరోగ్యాల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో క్రీడలను భాగంగా మల్చుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. శనివారం నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్రస్థాయి ఓపెన్ మాస్టర్స్ బాడ్మింటన్ టోర్నమెంట్-2024 క్రీడా పోటీలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాడ్మింటన్ క్రీడా పోటీలను నిర్వహిస్తుండడం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. నేటి తరం ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యతను ఇస్తూ క్రీడలు, వ్యాయామాలు, యోగా వంటి అభిరుచులను అలవర్చుకుంటున్నారని తెలిపారు. ఆఫీసర్స్ క్లబ్‌లో సభ్యత్వం అంటేనే ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించబడుతుందని, దీని ప్రతిష్టను మరింతగా ఇనుమడింపజేసేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆఫీసర్స్ క్లబ్ అభివృద్ధికి తనవంతు తోడ్పాటును అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా టీజీవోల సంఘం అధ్యక్షుడు అలుక కిషన్, ఆఫీసర్స్ క్లబ్ ప్రతినిధులు వెంకటరమణ, గంగాకిషన్, భక్తవత్సలం, రాంకిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య



నవతెలంగాణ-గాంధారి

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాంధారి మండలంలోని తిమ్మాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అవునూరి సాయవ్వ (38) ఇద్దరు కూతుర్ల పెండ్లి చేయగా.. అప్పులు అయ్యాయి. వాటిని తీర్చేందుకు భర్త దుబాయ్‌కు వెళ్లినా.. సరైనా పని దొరకలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేదని తీవ్ర మనస్తాపానికి గురై ఈ నెల 14వ తేదీనా ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్ వద్ద గడ్డిమందు తాగి పడిపోయింది. దీంతో కుటుంబీకులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్టు ఎస్ఐ తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ మహిళా మండలాధ్యక్షురాలుగా వసుంధర

నవతెలంగాణ-గాంధారి

మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా విభాగం ఇన్చార్జి అరుణ, మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో మహిళా కమిటీలు నియామకం గురించి శనివారం చర్చించారు. ఈ సందర్భంగా మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా వసుంధర నియమించారు. మహిళా విభాగం ఇన్చార్జి అరుణ మాట్లాడుతూ.. గాంధారి మండలంలో మహిళా కమిటీలు పటిష్టంగా ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో గాంధారి మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, గాంధారి మాజీ ఎంపిటిసి సభ్యులు తూర్పు రాజులు, కామెల్లి బాలరాజ్, లైన్ రమేష్, ఆకుల లక్ష్మణ్, సంఘని బాబా, బిసా గణేష్, సంఘని బాలయ్య, నీల రవి, అల్తాఫ్, నితిన్, ఈశ్వర్ గౌడ్, గడ శంకర్, బషీర్, హైమద్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే

నవతెలంగాణ-ముప్కాల్/రామారెడ్డి

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే యథావిధిగా కొనసాగుతున్నట్టు మండల ప్రత్యేకాధికారి స్రవంతి అన్నారు. శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇంటి యజమానులు ఎన్యూమరేటర్లకు పూర్తి స్థాయిలో సహకారాన్ని అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీవో గౌస్ మొహినోద్దీన్, మండల విద్యాధికారి జక్కుల రవి కుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు మల్లేష్ యాదవ్, గౌతమి, నగేష్, హన్మాండ్లు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

63 శాతం పూర్తయిన సమగ్ర కుటుంబ సర్వే..

రామారెడ్డి : మండలంలోని వివిధ గ్రామాల్లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే 63 శాతం పూర్తయినట్లు శనివారం ఎంపీడీవో తిరుపతిరెడ్డి తెలిపారు. సర్వేను ప్రత్యేక అధికారి సంజయ్ కుమార్, డిపిఓ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతిరెడ్డి, ఏపీవో ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా సాగుతున్న కొనుగోలు

నవతెలంగాణ-సదాశివనగర్

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో శనివారం వరకు 18,919 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేసినట్టు సీఈవో విగ్నేష్‌గౌడ్ తెలిపారు. సదాశినగర్ సొసైటీ పరిధిలోని ధర్మరావు పేట తిర్మన్‌పల్లి అమర్లబండ గ్రామాల్లో కొనుగోలు చేసినట్టు ఆయన తెలిపారు. 363 మంది రైతులు 47.298 బస్తాలు కొనుగోలు చేసినట్టు తెలిపారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని గోపాల్పేట గ్రామానికి చెందిన సావిత్రి, బాలకిషన్‌కు 46వేల 500 సీఎంఆర్ఎఫ్ పంపిణీ చేసినట్టు గోపాల్పేట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొరపతి శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ అధ్యక్షులు ఇమామ్, షాహిద్ పాషా, సుధాకర్, ఫారూఖ్ సాబ్, తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకులు ముందస్తు అరెస్టు

నవతెలంగాణ-భిక్కనూర్

ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు చలో బాసర త్రిబుల్ ఐటీ కి వెళ్లకుండా మండల కేంద్రంలో కామారెడ్డి ఎస్ఎఫ్‌డి ఇంచార్జ్ గంధం సంజయ్‌ని పోలీసులు శనివారం ముందస్తు అరెస్టు చేశారు. సంజయ్ మాట్లాడుతూ ఇది ప్రజా పాలన కాదని దగా పాలన అని మండిపడ్డారు. స్వాతి ప్రియా ఆత్మహత్యపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు విద్యార్థి సంఘాల నాయకుల పై రౌడీల ప్రవర్తించిన సిఎస్ఓ రాకేష్ తో పాటు బాధితులైన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు.

తప్పిదాలకు తావుండొద్దు

- డీఆర్‌డీఏ పీడీ సాయగౌడ్
- ముగిసిన మూడో విడత సామాజిక తనిఖీ సమావేశం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఉపాధిహామీ పనుల్లో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చూసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ సాయగౌడ్ అన్నారు. శనివారం ఇందల్‌వాయి మండల పరిషత్ కార్యాలయంలో మూడో విడత సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. గత కొన్ని రోజులుగా మండలంలోని అన్ని గ్రామాలలో చేపట్టిన తనిఖీలు గ్రామ సభలలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన వివరాలను వెల్లడించారు. ఆయా గ్రామాలలో పనుల్లో జరిగిన తేడాలు తదితర వాటిని వివరాలతో కూడిన నివేదికలను సభ ముందు తనిఖీ బృందాలు వెల్లడించారు. ఈ సంద ర్భంగా ఉపాధి హామీ సిబ్బందిని ఉద్దేశించి పీడీ సాయగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశానుసారం ముందస్తుగా ఆమోదం తెలిపిన వాటికి అధిక ప్రాధాన్యత ఇస్తూ పనుల్లో నిర్లక్ష్యం చేయకుండా మాస్టర్ల నిర్వహణ తదితరవాటిని చేపట్టే విధంగా సిబ్బంది చూడాలని ఆదేశించారు. ఈ సమావేశానికి అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి నారాయణ, ఎంపీడీవో లక్ష్మారెడ్డి, ఎంపీఓ రాజ్‌కాంత్‌రావు, ఏపీఓ కొడ్డం పోశెట్టితో పాటు ఆయా గ్రామాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నివేదికలను వెల్లడిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్

రాజ్యాధికారమే ఎజెండాగా ముందుకు సాగాలి

- బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్
- తెలంగాణలో రానున్నది బీసీల రాజ్యమే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాజ్యాధికారమే జెండా, ఎజెండాగా బీసీలందరూ ఐకమత్యంగా ముందుకు సాగాలని దాసు సురేష్ పిలుపునిచ్చారు. శనివారం నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో బీసీల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీసీరాజ్యాధికార సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు దాసు సురేష్ హాజరయ్యారు. బీసీలు పోరాడితే అగ్రవర్ణాలు అనివార్యంగా కుర్చీలు ఖాళీ చేయడం ఖాయమన్నారు. జాతీయ పార్టీలు ఓబీసీలను అమాయకులను చేసి మోసపూరిత విధానాలను అనుసరిస్తున్నాయని ఆరోపించారు. కులగణన చేయబోమని తెగేసి చెబుతున్నది ఒక్క పార్టీ అయితే అధికారంలో ఉన్నప్పుడు చేసినా ఆ కులగణన నివేదికను బయటపెట్టకుండా మోసం చేసి.. ఇప్పుడు మళ్లా చేస్తామంటూ మాట్లాడుతున్నది ఇంకో పార్టీ అని అన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న కులగణనపై సరైన పర్యవేక్షణ అవసరం ఎంతైనా ఉందన్నారు. బీసీలంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీలు తలుచుకుంటే ఢిల్లీ గద్దెను శాసించే సత్తా ఉందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

భారీగా నిధుల దుర్వినియోగం

- ఇంచార్జి ఏపీవోపై అడిషనల్ డిఆర్డీవో మండిపాటు


నవతెలంగాణ-పిట్లం

ఉపాధి హామీ ఇంచార్జి ఏపీవో శివకుమార్‌పై జిల్లా ఈజిఎస్ అడిషనల్ డిఆర్‌డిఓ వామన్‌రావు మండిపడ్డారు. శనివారం 2023-24వ ఆర్థిక సంవత్సరానికి గాను మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఈజీఎస్ అడిషనల్ డిఆర్‌డిఓ అధ్యక్షతన 15 విడిత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ నివేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మా నగర్ గ్రామ సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులను చదివి వినిపించారు. తనిఖీ బృందంలో ల్యాండ్ డెవలప్మెంట్ పనులకు సంబంధించిన బోర్డులు, ఎంబి బుక్‌లో రైతుల సంతకాలు సేకరించలేదన్నారు. కొందరు కూలీలు పనులకు రాకున్నప్పటికీ ఫీల్డ్ అసిస్టెంట్ లే జోక్యం కలిగించుకొని హాజరు వేసి కూలీ డబ్బులు చెల్లించారని నివేదించారు.

చిన్నకొడపుగల్ గ్రామ సామాజిక తనిఖీలో అర్హులైన వారికి జాబ్ కార్డులు ఇవ్వలేదని, నర్సరీలకు సంబంధించిన రికార్డులు, క్యాష్ బుక్కులు గ్రామ సామాజిక తనిఖీ వారికి నివేదించలేదని సభ ముందుంచారు. మాస్టర్‌లలో కూలీల సంతకాలు లేకుండానే కూలీ డబ్బుల చెల్లిస్తున్నారని తెలిపారు. యాక్షన్ ప్లాన్ లేకుండానే పనులు నిర్వహిస్తున్నారన్నారు. పనులు ఒక గ్రామంలో డబ్బుల చెల్లింపులు ఒక గ్రామంలో జరిగాయని నివేదించారు.

మార్దండ గ్రామంలో నిర్వహించిన సామాజిక తనిఖీల్లో రెండు కళ్ల లేని అందుడు ఉపాధి హామీ పనులకు హాజరు కావడం ఆయన పేరు మీద రూ.10వేల 300 చెల్లించినట్టు సామాజిక తనిఖీలో వెల్లడించారు. కొన్ని గ్రామాలలో కూలీలు పనులకు రాకున్నప్పటికీ మాస్టర్‌లలో ముందే సంతకాలు పెట్టి డబ్బుల చెల్లింపులు నిర్వహించినట్టు సామాజిక తనిఖీ బృందం వెల్లడించారు. ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబీకులు పనులకు రాకున్నప్పటికీ సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబీకుల పేరున డబ్బుల చెల్లింపులు చేశారని నివేదించారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు, మెట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఇష్టం వచ్చినట్టుగా జాబ్ కార్డులు పొందడం ఏమిటని వీటన్నింటి పనులకు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మండలంలో నిర్వహించినా ఉపాధి హామీ సంబంధిత ఫోటోలను వెంటనే నివేదించాలని ఇన్చార్జి ఏపీవో శివకుమార్‌ను అడిషనల్ డిఆర్‌డిఓ వామన్ రావు ఆదేశించారు. లేని పక్షంలో శాఖపరమైన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబర్స్ మెన్ శ్రీనివాస్, ఎంపీడీవో కమలాకర్, ఎస్సార్పి మహేశ్వర్, ఇంచార్జ్ ఏపీవో మహేష్, డిఆర్‌పి, సివో రాజేశ్వరి, ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ నివేదికలో జరిగిన అవకతవకలను నివేదిస్తున్న తనిఖీ బృందం

సర్వే పత్రాలను భద్రపరచాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామాల్లో చేపడుతున్న కుల గణన ఆర్థిక సామాజిక సర్వే పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలోని పెట్టెల్లో భద్రపరచాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి కిందిస్థాయి అధికారులకు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా సర్వే చేసినటువంటి సర్వే పత్రాలను ఎన్యూమరేటర్ల వద్ద నుంచి వారి కోడ్ ఆధారంగా తీసుకొని భద్రపరచాలన్నారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని సర్వేలో పర్యవేక్షించాలన్నారు. సర్వేలో తప్పులు లేకుండా చూడాలన్నారు. సర్వే చేసిన పత్రాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ భాగంగా ఎన్ని కంప్యూటర్లు అందుబాటులో ఉన్నాయి. ఎంతమంది సిబ్బంది అవసరమని మండల పరిషత్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వేపత్రల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ఏర్పాట్లు ఏ విధంగా చేయాలో వివరించారు. అనంతరం సబ్ రిజిస్టర్ ఎంఆర్‌ఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనఖీ చేశారు. ధరణి సమస్యలు రిజిస్ట్రేషన్ సమస్యలను రోజుకు ఎన్ని రిజిస్ట్రేషన్లు అవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మార్వో నరేందర్, ఎంపీడీవో నరేష్, ఎంపిఓ మలహరి, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

నేడు 'ఊషూ' రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న 'ఊషూ' రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహిస్తున్నట్టు ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు కె.గంగాధర్, అంజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడా పోటీలను తిలకించేందుకు మండలంలోని యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు మోతె గంగారెడ్డి, నేర బాబూరావు, ఫిజికల్ డైరెక్టర్ రాజ్ కుమార్, పీఈటీలు మధుకర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీ

నవతెలంగాణ-నవీపేట్

బాసర త్రిబుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య, విద్యార్థి నాయకులపై పోలీసుల దాడికి నిరసనగా శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో చలో త్రిబుల్ ఐటీ కార్యక్రమాలు సందర్భంగా పోలీసులు శనివారం యంచ వద్ద తనిఖీలు నిర్వహించారు. వాహనాలను పోలీసు బలగాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టి అనుమానం వచ్చిన వారిని అరెస్టు చేశారు. చలో బాసర కార్యక్రమానికి విద్యార్థులు వెళ్లకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదాన భిక్ష



అన్నదానం చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్


పట్టణంలోని సిద్దుల గుట్టపై ఉన్న అయ్యప్పస్వామి క్షేత్రంలో ఆలయ ధర్మకర్త, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి నగేష్ శర్మ మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామివారిని తమ ఇంటిపేరుగా మార్చుకున్న గొప్ప భక్తుడని అన్నారు. సొంత డబ్బులతో గుడి ఏర్పాటు చేశారని, రాబోయే కాలంలో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, కాంగ్రెస్ నాయకులు, భారత్ గ్యాస్ మేనేజర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సందర్శన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనాపూర్ గ్రామపంచాయతీని ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ రికార్డులను పరిశీలించారు. గ్రామంలో ఇంటి పన్ను బకాయిల వివరాలను, వసూళ్ల వివరాలను పంచాయతీ కార్యదర్శి నవీన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ట్రైనర్ ఆఫ్ ట్రైనర్ సిహెచ్ రాంప్రసాద్ తదితరులున్నారు.

పాఠశాలల తనిఖీ



నవతెలంగాణ-రెంజల్

మండలం లోని కస్తూర్బా గాంధీ పాఠశాల, ఆదర్శ పాఠశాల లోని ఇంటర్మీడియట్ బాలికల హాస్టల్‌ను జెండర్ కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ రెండు పాఠశాలలలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో ఆమె మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు చక్కగా చదువుతూ ర్యాంకులు సాధించాలని ఆమె విద్యార్థులను ఆదేశించారు. బాలికలకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్లోని వంట గదులను ఆమె పరిశీలించారు. బాలికలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు బోధన విషయంలో ఎలాంటి సందేహాలు వచ్చినా వాటిని ఉపాధ్యాయులు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకురాలు శ్యామల, సుజాత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

కనీస అవసరాల కోసం ధర్మయుద్ధం



మాట్లాడుతున్న బోలేశ్వర్

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ లో అనగారిణ పేద ప్రజలైన బిసి, ఎస్సి, ఎస్టీలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం పేదలకి భూమి ఇల్లు, కోసం ధర్మ సమాజ్ పార్టీ ధర్మ యుద్ధం చేయబోతుందని జిల్లా కన్వీనర్ ఉగ్రవాయి బోలెశ్వర్ అన్నారు. శనివారం నిర్వహించిన కామారెడ్డి జిల్లా ధర్మసమాజ్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు ఈ ఐదు గ్యారంటీలను ప్రజలకు అందించే వరకు ప్రభుత్వంపై కొట్లాడుతామన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కమిటీ మెంబెర్ లక్ష్మణ్ జిల్లా నాయకులు గంగరాజు, రాజశేఖర్, కవిన్, రామకృష్ణ, సత్యం, వినయ్ తదితరులు పాల్గొన్నారు.